క్లుప్తంగా

'ఉపాధి' పనుల పరిశీలన

పాన్‌గల్: మండలంలోని దొండాయిపల్లి, బుసిరెడ్డిపల్లిలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం ఏపీఓ కుర్మయ్య పరిశీలించారు. రైతులకు ఉపయోగపడే పనులు, సాగునీటి కాల్వల మరమ్మతు పనులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

శాంతియుత వాతావరణంలో పండుగలు

పెబ్బేర్‌రూరల్: గ్రామాల్లో నిర్వహించుకునే పండుగలను ప్రజలు శాంతియుతంగా నిర్వహిస్తూ, ఆదర్శంగా నిలువాలని మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సతీమణి వాసంతి అన్నారు. బుధవారం శ్రీరంగాపురం మండలంలోని నాగరాలలో నిర్వహించిన బొడ్రాయి ప్రతిష్ఠ పూజలో ఆమె పాల్గొని పాల్గొన్నారు. అదేవిధంగా టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

పెబ్బేరు: మున్సిపాలిటీలో డబుల్ బెడ్రూం ఇళ్ల దరఖాస్తులు స్వీకరించేందుకు 30వ తేది వరకు గడువు పెంచినట్లు తహసీల్దార్ అబ్రహాంలింకన్ బుధవారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుతో పాటు కుటుంబ సభ్యుల ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంక్ అకౌంట్ పాస్‌బుక్, ఓటర్ కార్డు, ఆధాయ, కుల ధ్రువపత్రాలు, దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ జిరాక్స్‌లు జతపరిచాలని, వార్డుల వారీగా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

ఆధార్ అప్‌డేట్ చేసుకోండి

మదనాపురం: మండలంలోని నెలివిడిలో ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని తహసీల్దార్ నరేందర్ బుధవారం పరిశీలించారు. ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా ఏర్పాటు చేసిన ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని చెప్పారు. అన్ని గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

పంచాయతీ కార్యదర్శుల కమిటీ ఎన్నిక

వీపనగండ్ల: మండల జూనియర్ పంచాయతీ కార్యదర్శుల కమిటీ ఏకగ్రీవంగా బుధవారం ఎంపిక చేసుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా శ్యాంసుందర్, జ్యోతి, ప్రధానకార్యదర్శిగా బాలశేషు, కోశాధికారిగా రాజశేఖర్, మీడియా సెల్ కన్వీనర్‌గా నరేష్‌గౌడ్, జిల్లా సమన్వయ కర్తగా రాజబాబు, సహాయ కార్యదర్శులుగా రాము, రాజునాయక్, వీరితో పాటు సభ్యులుగా ఏకగ్రీవంగా ఎంపిక చేసుకున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు.

విగ్రహ ఏర్పాటుకు ఆర్థికసాయం

చిన్నంబావి: మండలంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటుకు రూ.25 వేలు టీపీసీసీ సభ్యుడు జగదీశ్వర్‌రావు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో విష్ణు, విజయ్‌భాస్కర్ రెడ్డి, రామ్‌సింగ్, పుల్లారెడ్డి, అజయ్, చక్రీ పలువురు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం తగదు

ఆత్మకూర్: జాతీయ ఉపాధి హామీ పనుల్లో నిర్లక్ష్యం తగదని, లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యాదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. వేసవి నేపథ్యంలో ఉపాధి కూలీలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రానున్న హరితహారంలో భాగంగా లక్ష్యానికి మించి మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ విజయభాస్కర్‌రెడ్డి, టెక్నికల్‌అసిస్టెంట్ రఘు, కార్యాదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

పాత వస్తువుల నిల్వతో నష్టాలు

ఆత్మకూర్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు తమ వద్దనున్న పాతవస్తువులు, పాత దుస్తులు, పాదరక్షలు, బుక్కులు, న్యూస్‌పేపర్లు అప్పగించాలని చైర్‌పర్సన్ గాయత్రి, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు, కౌన్సిలర్లు అన్నారు. బుధవారం ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆర్‌ఆర్‌ఆర్ కార్యక్రమంలో భాగంగా 10 వార్డుల్లో శిబిరాలను ఏర్పాటు చేసి పాత వస్తువులను సేకరించారు. పాతవస్తువులు ఇళ్లలో నిల్వ ఉండడటం కారణంగా నష్టామే అన్నారు. పాతసామాన్లు అప్పగించిన వారికి ప్రశంసాపత్రాలను అందజేస్తామని పట్టణ అభివృద్ధికి, పరిశుభ్రతకు సహకరించాలని కోరారు.

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్లను బుధవారం మున్సిపల్ మేనేజర్ గణేష్‌బాబు పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణ కేంద్రంలోని ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్లలో పాత వస్తువులను అప్పించాలని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈఈ యోగేష్‌కుమార్, రాజు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

- జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి
- సీఎం కప్ విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతి అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి: విద్యార్థులు బాల్యం నుంచే చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక డాక్టర్ బాలకిష్టయ్య క్రీడాప్రాంగణంలో సీఎంకప్–23 ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గెలుపుఓటమి సహజమేనని, పోటీల్లో పాల్గొని నైపుణ్యాన్ని ప్రదర్శించటమే ప్రధానమన్నారు. 9 రకాల క్రీడా పోటీల్లో ఆయా మండలాల నుంచి వచ్చిన క్రీడాకారులు పాల్గొనటం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని యువతీయువకుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించారన్నారు. ప్రతి పాఠశాల, కళాశాలలో క్రీడా మైదానం ఉండే విధంగా తమవంతుగా కృషి చేస్తామన్నారు.

కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్ మాట్లాడుతూ.. ప్రతి క్రీడాకారుడు గెలవాలనే తపన, పట్టుదల ఉంటుందని ఇదే స్ఫూర్తి వారిని జీవితంలో విజేతగా నిలుపుతుందన్నారు. ప్రభుత్వం తరఫున అన్ని పంచాయతీల్లో, మున్సిపాలిటీల్లో తెలంగాణ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశామని, పంచాయితీల్లో, వార్డుల్లో క్రీడలు నిర్వహించేందుకు ఈ క్రీడా ప్రాంగణాలు ఎంతో ఉపయోగ పడుతున్నాయన్నారు. జిల్లాలో నిర్వహించిన సీఎంకప్–23 క్రీడాపోటీలకు వచ్చిన క్రీడాకారులు, వారిని ప్రోత్సహించిన వ్యాయామ ఉపాధ్యాయులు, ఎంపీడీఓలు, నిర్వహణలో పాలుపంచుకున్న అధికారులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. గెలిచిన క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర స్థాయిలో జిల్లా నుంచి వివిధ విభాగాల్లో పాల్గొనేందుకు 178 మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. వారు రాష్ట్ర స్థాయిలో రాణించి జిల్లాను మొదటి స్థానంలో నిలుపాలని ఆకాంక్షించారు. ఉత్తమ ప్రతిభ కనపరచిన క్రీడాకారులు ఐదుగురిని ఒక్కొక్కరికి కలెక్టర్ వ్యక్తిగతంగా రూ.5వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. అనంతరం జెడ్పీ చైర్మన్, కలెక్టర్ విజేతలకు ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఎఫ్ఓ నవీన్‌రెడ్డి, డీవైఎస్ఓ సుధీర్‌రెడ్డి, డీఈఓ గోవిందరాజులు, అడిషనల్ ఎస్పీ షాకీర్ హుస్సేన్, ఆత్మకూర్ జెడ్పీటీసీ శివరంజని, కౌన్సిలర్ నాగన్న యాదవ్, జిల్లా అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

ఫుట్‌బాల్‌లో పురుషులు, మహిళల విభాగాల్లో పెబ్బేరు ప్రథమ, వీపనగండ్ల జట్టు ద్వితీయ స్థానాలను దక్కించుకున్నాయి. కబడ్డీలో జిల్లా ప్రథమ బహుమతి పెబ్బేరు జట్టు, ద్వితీయ బహుమతి ఆత్మకూరు జట్టు కైవసం చేసుకుంది. మహిళా విభాగంలో వనపర్తి మండలం ప్రథమ, పెద్దమందడి మండలం ద్వితీయ బహుమతులు దక్కించుకున్నాయి. వాలీబాల్‌లో పురుషుల విభాగం ప్రథమ బహుమతి మదనాపురం జట్టు, ద్వితీయ బహుమతి ఖిల్లాఘనపురం మండలం జట్టు సాధించుకున్నాయి. ఖోఖోలో ప్రథమ బహుమతి పెద్దమందడి, ద్వితీయ బహుమతి ఖిల్లాఘనపురం సాధించుకోగా, మహిళా విభాగంలో ప్రథమ బహుమతి ఆత్మకూరు, ద్వితీయ బహుమతి వనపర్తి జట్లు కైవసం చేసుకున్నాయి. బ్యాడ్మింటన్‌లో ప్రథమ బహుమతి సంతోష్, ద్వితీయ బహుమతి ఇక్షిత దక్కించుకున్నారు. వంద మీటర్ల పరుగు పందెంలో ప్రథమ బహుమతి శ్రీరంగాపూర్‌కు చెందిన జీ.రాఘవేంద్ర, ద్వితీయ బహుమతి కొత్తకోటకు చెందిన షబీన్ దక్కించుకున్నారు. మహిళా విభాగంలో వనపర్తికి చెందిన పద్మ, ద్వితీయ బహుమతి జ్యోతి సాధించారు. 400 మీటర్ల పరుగు పందెంలో మదనాపురానికి చెందిన గణేష్, ద్వితీయ బహుమతి ఘనపురానికి చెందిన వాల్యా కైవసం చేసుకున్నారు. మహిళా విభాగంలో వనపర్తికి చెందిన జ్యోతి ప్రథమ, పద్మ ద్వితీయ స్థానాల్లో నిలిచారు. లాంగ్‌జంప్‌లో వీపనగండ్లకు చెందిన భానుప్రసాద్ ప్రథమ మహుమతి, నవీన్ ద్వితీయ బహుమతి సాధించుకున్నారు. మహిళా విభాగంలో వనపర్తికి చెందిన అనిత ప్రథమ, జ్యోతి ద్వితీయ బహుమతులు దక్కించుకున్నారు.

షాట్‌పుట్‌లో చిన్నంబావికి చెందిన ఆర్.రాజేష్ ప్రథమ, ఆత్మకూరుకు చెందిన శివకృష్ణ ద్వితీయ బహుమతి సాధించుకున్నారు. మహిళా విభాగంలో కొత్తకోటకు చెందిన సుజాత ప్రథమ, వనపర్తికి చెందిన ఖజీమిన్ బేగం ద్వితీయ బహుమతి సాధించుకున్నారు.

వైద్య సిబ్బంది సేవలు మరువలేనివి



మాట్లాడుతున్న అధికారులు

పాన్‌గల్: మండల పీహెచ్‌సీ పరిధిలోని క్షయ వ్యాధి నివారణలో వైద్య సిబ్బంది సేవలు మరువలేనివి అని ఇన్‌చార్జ్ తహసీల్దార్ చక్రపాణి, ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో నిక్షయ్ దివస్ కార్యక్రమంలో అధికారులు, క్షయ వ్యాధి నుంచి స్వస్థత పొందిన వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రోగులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి క్రమం తప్పకుండా సకాలంలో మందులను అందించి వ్యాధి నుంచి ఆరోగ్యంగా మారడానికి కృషి చేయడం అభినందనీయమన్నారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో వ్యాధి నివారణపై అవగాహన కల్పించి క్రమం తప్పకుండా మందులు వాడేలా కృషి చేశారని పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు హైమావతి, గోప్లాపూర్ సర్పంచ్ రాణి, అన్నారంతండా సర్పంచ్ రంగానాయక్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలను కృషి చేద్దాం..

ఆత్మకూర్: క్షయ నిర్మూలను ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, అనుమానితులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరీక్ష చేయించుకోవాలని తిప్పడంపల్లి వైద్యాధికారి ముజఫర్ అన్నారు. బుధవారం మండలంలోని రేచింతలలో నిక్షయ్ దివాస్ కార్యక్రమంలో భాగంగా టీబీ గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించి వారివద్ద నుంచి శాంపిల్స్‌ను సేకరించారు. తిప్పడంపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండలంలోని గ్రామాల్లో శిబిరాలను ఏర్పాటుచేసి శాంపిల్స్‌ను సేకరించి ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షలు చేయిస్తామన్నారు. వ్యాధి బారిన పడ్డవారికి వైద్యసేవలు అందిస్తూ, ఉచితంగా మందులను అందజేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో సురేందర్‌గౌడ్, సరిత, ఆశా కార్యకర్తలు, వైద్యసిబ్బంది, ఉన్నారు.

అమరచింత: ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం రంగులతో ముగ్గులు వేసి టీబీ నివారణలో ప్రజలు బాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. టీబీని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలు సైతం పొగొట్టుకునే అవకాశం ఉందన్నారు. ఆరు నెలల పాటు వైద్యసేవలు పొంది, వైద్యుల సూచనలు పాటిస్తే టీబీని అరికట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సుపర్ వైజర్ సత్యమ్మ, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



రేచింతలలో మాట్లాడుతున్న డాక్టర్ ముజాఫర్

నిధుల మంజూరుపై హర్షం

పెబ్బేరు: మున్సిపాలిటీతో పాటు మండలంలోని పలు గ్రామాల అభివృద్ధి పనులకు రూ. 6.72 కోట్లు నిధులు మంజూరు కావడంతో బుధవారం మున్సిపల్ చెర్‌పర్సన్ కరుణశ్రీ, ఎంపీపీ శైలజ, మున్సిపల్ వైస్ చైర్మన్ కర్రెస్వామి, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ మండలం అభివృద్ధి కోసం మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఎంతో కృషిచేశారని తెలిపారు. పట్టణ కేంద్రంలోని వివిధ అభివృద్ధి పనులకు, కమ్యూనిటీ హాల్స్, మిగిలిన పనులకు రూ.64 లక్షలతో పాటు అదనంగా రూ. 55 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. సెగ్రిగేషన్ షెడ్‌కు రూ.50 లక్షలు, వనపర్తి రోడ్డుకు ఇరువైపులా సుభాష్ చౌరస్తా నుంచి జూరాల ప్రధాన కాల్వ వరకు డ్రెయినేజీ పనులకు రూ. 2.80 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. అయ్యవారిపల్లి, బున్యాధిపూర్, ఈర్లదిన్నె, గుమ్మడం, జనుంపల్లి, కంచిరావుపల్లి, సూగూర్, పాతపల్లిలో అభివృద్ధి పనులకు రూ. 2.23 కోట్లు నిధులు మంజూరైనట్లు వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పార్వతీగౌడ్, మేకల యల్లయ్య, సాయినాథ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో రోగాలు దూరం



అవగాహన కల్పిస్తున్న ఆంజనేయరెడ్డి

పాన్‌గల్: నిత్యం శ్వాస మీద ధ్యాస పెట్టి ధ్యానం చేస్తే షుగర్, బీపీ, ఇతర రోగాలకు దూరంగా ఉండొచ్చని పిరమిడ్ స్పిర్చువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్లా ఆంజనేయరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో గ్రామస్తులకు ధాన్యంపై అవగాహన కల్పించారు. నిత్య జీవితంలో ధ్యానం చేయడం అలవర్చుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చున్నారు. ప్రతి ఒక్కరూ యోగాపై దృష్టి సారించాలన్నారు. మాంసాహారం మాని శాఖహార అలవాట్లను అలవర్చుకోవాలన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా

అమరచింత: పట్టణంలోని మూడో వార్డులో ఎట్టకేలకు సీసీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ మహమ్మద్ ఖాజా బుధవారం ప్రారంభించారు. కొన్ని రోజులుగా మూడో వార్డుకు మంజూరైనా సీసీ రోడ్డు వేయడం లేదని, మున్సిపల్ చైర్‌పర్సన్ వివక్ష చూపుతున్నారని కౌన్సిలర్ విజయరాములు ఆందోళన చేపట్టారు. చైర్‌పర్సన్ స్పందిస్తు కాలనీలో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు కాలనీ ప్రజలతో మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కరం కోసం తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కార్యదర్శులు

అమరచింత: సీఎం కేసీఆర్ చిత్రపటానికి జూనియర్ పంచాయతీ కార్యదర్శులు బుధవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో ఎంపీడీఓ జ్యోతి సమక్షంలో పాలాభిషేకం చేశారు. సంఘం మండల అధ్యక్షుడు సయ్యద్ రాజిక్ మాట్లాడుతూ తమకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని సీఎం హామీ ఇవ్వడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ నర్సింహులు, ఆశిరెడ్డి పలువురు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ దేశానికే దిక్సూచి..

ఆత్మకూర్: ముఖ్యమంత్రి కేసీఆర్ కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని ఎంపీపీ బంగారుశ్రీనివాసులు, చైర్‌పర్సన్ గాయత్రి, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, విండో అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద జూనియర్ పంచాయతీ కార్యదర్శులతో కలిసి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కేసీఆర్ చెప్పిన మాట తప్పరని రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఏదోరకంగా మేలు చేకూరుస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, రవియాదవ్, వీరేశలింగం, మండ్లరామకృష్ణ, మురళీ, విష్ణు, మన్యం, శంకర్, శిరీష, రవిప్రకాష్, మహబూబ్‌ఖాన్, నాగరాజు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య భవనంలో సమస్యల తిష్ఠ

అమరచింత: మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో సమస్యలు తిష్ఠ వేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు తెలిపారు. మండల మహిళా సమాఖ్య భవనాన్ని బుధవారం సీపీఐ బృందం పరిశీలించింది. జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ.. భవనం రంగు వెలిసిపోయిందన్నారు. మరుగుదొడ్లు లేవని, తాగునీటి వసతి లేదని, ఫ్లోరింగ్ దెబ్బతిన్నట్లు తెలిపారు. ప్రభుత్వం జూన్ 2 నుంచి రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాలకు మహిళలు వస్తారని ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా సమాఖ్య భవనంలో సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు మున్సిపల్ కమిషనర్‌తో పాటు ఎంపీడీఓలకు విన్నవించినా ఫలితం లేదన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు



తండావాసులకు అవగాహన కల్పిస్తున్నా ఏఈ చందన్‌కుమార్‌రెడ్డి

పాన్‌గల్: ప్రతి ఇంటికి విద్యుత్ మీటర్‌ను తప్పక ఏర్పాటు చేసుకోవాలని మండల ట్రాన్స్‌కో ఏఈ చందన్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండాను సందర్శించి విద్యుత్ మీటర్లపై తండావాసులకు అవగాహన కల్పించారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కేసులు నమోదు అవుతాయన్నారు. మీటర్లు లేని ప్రతి ఒక్కరు ఈనెల చివరి నాటికి మీటర్లను పొందాలని, లేకుంటే వారి ఇంటికి అనధికారికంగా ఉన్న కనెక్షన్లు తొలగిస్తామన్నారు. దీంతో పాటు తండాలో నెలకొన్న విద్యుత్ సమస్యలను సర్పంచ్ శాంతమ్మ ఏఈ దృష్టికి తీసుకువచ్చారు. తండాలో ఆరు 25కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని, శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని ఏఈకి సూచించారు. ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలతో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందని సర్పంచ్ ఏఈకి సూచించారు. ఆయా సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సాహితీ ఉత్సవాలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న కృష్ణయ్య

వనపర్తిటౌన్: సాహితీ ఉత్సవాలను జయప్రదం చేయాలని స్టీరింగ్ కమిటీ జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సగర సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై మాట్లాడారు. 27వ, తేదీన పాటకు పట్టాభిషేకం, 28వ, తేదీన కవి సమ్మేళనంను ఉంటుందన్నారు. కార్యక్రమాలకు మంత్రి నిరంజన్‌రెడ్డి, సాహిత్య అకాడమీ అధ్యక్షుడు జూలూరి గౌరీ శంకర్, ప్రజాప్రతినిధులు హాజరవుతున్నారని, కార్యక్రమాలకు కవులు, గాయకులు అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో నాగరాజు, రాజారామ్‌ప్రకాష్, నాంగేంద్రం సాగర్, అంజన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను ఇబ్బందులకు గురిచేయొద్దు



అమరచింత: మరికల్–ఆత్మకూర్ ప్రదాన రహదారిని ఆక్రమించుకుని ఇబ్బందులకు గురిచేసే వారిపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్‌ఖాజా తెలిపారు. పట్టణంలోని భగత్ సింగ్ సమీపంలో సవరమ్మ దేవాలయం ఎదురుగా ఉన్న పాత ఇనుప సామాన్ల దుకాణదారుడు ప్రధాన రహదారిపై మూటలు వేసి ఉంచాడు. దీంతో రాకపోకలకు అంతరాయం కలుగుతుండడంతో వాటిని మున్సిపల్ ఆటోలో తీసుకెళ్లారు. వ్యాపారులు తమ దుకాణాల ఎదుట రహదారికి సమీపంలో వస్తువులు అడ్డంగా ఉంచకూడదని సూచించారు.

పోటాపోటీగా మాజీ ఎమ్మెల్యేకు నివాళి



నివాళ అర్పిస్తున్న ఐక్యవేదిక నాయకులు

వనపర్తి: దివంగత మాజీ ఎమ్మెల్యే జయరాములు వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక మరికుంట ప్రాంతంలోని ఆయన సమాధి వద్ద పలు పార్టీల నాయకులు తొలిసారిగా, పోటాపోటీగా పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కొన్నేళ్ల పాటు ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను సొంత పార్టీ వారుసైతం మరిచిపోయారు. కేవలం కుటుంబ సభ్యులు మాత్రమే నివాళి అర్పింస్తుండేవారు. గతేడాది 37వ వర్ధంతి సందర్భంగా వనపర్తి అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు పెద్ద ఎత్తున నివాళి అర్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. అప్పటి వరకు అక్కడ మాజీ ఎమ్మెల్యే సమాధి ఉన్న విషయం చాలా మందికి తెలియదని చెప్పవచ్చు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ, బీసీ నినాదం చాపకింద నీరులా ప్రభావం చూపిస్తుండటంతో ఆయన వర్ధంతిని పురస్కరించుకుని ఆయా పార్టీల నాయకులు నివాళి అర్పించటం శోచనీయం. మొదట అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు, తర్వాత కాంగ్రెస్, అనంతరం జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి టీడీపీ పట్టణాధ్యక్షుడితో కలిసి, చివరికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్ సైతం మాజీ ఎమ్మెల్యే సమాధి వద్ద పూలమాలలు ఉంచి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్‌యాదవ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌యాదవ్, రాజారాంప్రకాష్, డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, సీపీఎం పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ, సీపీఐ పట్టణ కార్యదర్శి రమేష్, గంధం నాగరాజు తదితరులు హాజరయ్యారు.

కంటివెలుగును సద్వినియోగం చేసుకోండి



కంటివెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ అఫ్జల్

కొత్తకోట రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పెద్దమందడి ఎంపీడీఓ అఫ్జల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పాత పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని ఎంపీడీఓ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని, అవసరం ఉన్న వారికి ఉచితంగా మందులు ఇవ్వడంతో పాటు కావాల్సిన వారికి అద్దాలను ఇస్తారన్నారు.

కేఎల్ఐ కాల్వలో పేరుకుపోయిన జమ్ము



కేఎల్ఐ కాల్వలో ఏపుగా పెరిగిన జమ్ము

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల గుండా ఉన్నా కేఎల్ఐ కాల్వలో పేరుకపోయిన జమ్మును తొలగించాలని రైతులు కోరుతున్నారు. వర్షాకాలంలో ముందే జమ్ము, పేరుకపోయిన మట్టిని తొలగిస్తే సాగునీరు సాఫీగా ప్రవహించే అవకాశం ఉంటుందని రైతులు తెలుపుతున్నారు. మరమ్మతు చేపట్టకపోతే ముందు గ్రామాల రైతులకు సాగునీరు అందే అవకాశం లేదని ఆందోళన చెందుతున్నారు.

పక్కాగా పారిశుద్ధ్య పనులు



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న డీపీఓ

ఖిల్లాఘనపురం: జిల్లాలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు పక్కాగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రాన్ని ఆయన సందర్శించారు. గ్రామంలోని మురుగు కాల్వలు, రోడ్లు, పల్లె ప్రకృతి వనం, క్రీడాప్రాంగణాలు రోడ్ల వెంట నాటిన మొక్కలను పరిశీలించడంతో పాటుగా స్టేడియం గ్రౌండ్‌లో వేసవి అథ్లెటిక్స్ శిక్షణ శిబిరాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించడంతో పాటుగా ఎప్పటికప్పుడు పిచ్చి మొక్కలు తొలగించాలన్నారు. హరితహారం కార్యక్రమాల్లో భాగంగా రోడ్ల వెంట నాటిన మొక్కల సంరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యదర్శులు తరుచుగా గ్రామాల్లో తిరుగుతు సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు. వేసవి క్రీడా శిబిరంలో క్రీడాకారులతో మాట్లాడిన ఆయన ప్రభుత్వం క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలను చేపట్టిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి రవితేజ తదితరులు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయండి



పెబ్బేరు: పట్టణంలోని డబుల్ బెడ్రూం ఇళ్లను బుధవారం మున్సిపల్ చెర్‌పర్సన్ కరుణశ్రీ పరిశీలించారు. పేద ప్రజల కోసం ప్రభుత్వం నిర్మిస్తున్న ఇళ్ల పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కర్రెస్వామి, కమిషనర్ ఆదిశేషు, తహసీల్దార్ అబ్రహంలింకన్, డిప్యూటీ తహసీల్దార్ జయసింహ, ఏఈ రమేష్‌నాయుడు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించలేని ప్రభుత్వం



సమ్మెలో మాట్లాడుతున్న విజయరాములు

అమరచింత: ప్రభుత్వం ఐకేపీ, వీఓఏల సమస్యలను పరిష్కరించడంలో ద్వంద్వ వైఖరి ప్రదర్శించడం తగదని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం వద్ద బుధవారం ఐకేపీ వీఓఏల నిరవధిక సమ్మెకు మద్దతు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చర్చల పేరిట కాలాన్ని గడిపేస్తుందన్నారు. డిమాండ్స్‌ను నెరవేర్చకుండా కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు. వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కనీస వేతనం నెలకు రూ.26 వేలు అందించాలని డిమాండ్ చేశారు. గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతి నెల వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో వేతనాలు జమ చేయాలని కోరారు. కార్యక్రమంలో అబ్రహం, భాస్కర్, కుతుబ్, ఎర్రన్న, వీఓఏలు పావని, రంగన్న, రాధ పలువురు పాల్గొన్నారు.